అన్ని దానాల్లో రక్తదానం మిన్న

పాత గుంటూరు: అన్ని దానాల్లో రక్తదానం మిన్న అని జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.రవికాంత్ తెలిపారు. ఆర్టీసీ బస్టాండ్‌లోని తిక్కన సమావేశ మందిరంలో 35వ రోడ్డు భద్రతా మాసోత్సవాల్ని పురస్కరించుకుని జీజీహెచ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఐదు డిపోలకు చెందిన 63 మంది సిబ్బంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఈడీ ఆదం సాహెబ్ పాల్గొని సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందించారు.

జగన్ పాలనలో గడప దగ్గరకే సంక్షేమం

పట్నంబజారు: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల అభివృద్ధి కోసం ఎంతటి కష్టానికీ వెరవరని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా, వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా తెలిపారు. పాత గుంటూరు పదో డివిజన్ పరిధిలోని అలీనగర్, కంకికొడవలి బొమ్మ సెంటర్, అంకమ్మతల్లి గుడి సెంటర్ ప్రాంతాల్లో శనివారం 'సిద్ధం' కార్యక్రమంలో భాగంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధిని ప్రజలకు గడప వద్దకు చేరుస్తున్న ఘనత సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతోందని తెలిపారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా మాట్లాడుతూ దివంగత మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి ప్రజాసంక్షేమం కోసం రెండు అడుగులు ముందుకు వేస్తే, ఆయన తనయుడు పది అడుగులు వేస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో పదో డివిజన్ కార్పొరేషన్ షేక్ మీరావలి, నేతలు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే ముస్తఫా, నూరిఫాతిమా

• పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలోని అన్నమయ్య కళావేదికపై రామరాజు ఫౌండేషన్, వాగ్దేవి సంగీత నిలయం సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 17న తొమ్మిది మంది వీణ విద్వాంసులతో కచేరీలు నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ చైర్మన్ రామరాజు శ్రీనివాస్ తెలిపారు.

దళితుల సమస్యలపై 'కనపర్తి' పోరాటం

నెహ్రూనగర్:దళితుల సమస్యలపై కనపర్తి ఏసురత్నం అలుపెరగని పోరాటం చేశారని సంస్మరణ సభ నిర్వాహణ కమిటీ సభ్యులు యండ్రపాటి అశోక్‌కుమార్ తెలిపారు. ఏసీ కాలేజీలోని జేడీ శీలం ఫంక్షన్ హాలులో శనివారం సంస్మరణ సభ నిర్వహించారు. అశోక్‌కుమార్ మాట్లాడుతూ ఏసురత్నం ఆశయ సాధనకు నేటి యువత కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో నిర్వహణ కమిటీ సభ్యులు వేము సమత ప్రవుల్లోపాధ్యాయ, నరేంద్ర సుధాకర్, చిన్నం డేవిడ్ విలియమ్స్, వీసా జ్ఞానరాజు, రాయపూడి మరియదాసు, గుదిబండి వేణుగోపాలరెడ్డి, పిల్లి వాసు, తురుమెళ్ల మోహనరావు, జీఆర్ భగత్‌సింగ్, డాక్టర్ ప్రత్యూష పాల్గొన్నారు.

పీవీకి భారతరత్న జాతికే గర్వకారణం

గుంటూరు రూరల్: మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు భారతరత్న ఇవ్వడం భారతజాతికే గర్వకారణమని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోనూరి సతీష్ శర్మ తెలిపారు. ఇన్నర్ రింగ్‌రోడ్డులోని సమాఖ్య కార్యాలయంలో శనివారం పీవీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాఖ్య తొమ్మిదేళ్ల పోరాటం, కలను నేడు నెరవేర్చిన ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలిపారు.